ప్రజాశక్తి

మంగళవారం 24 సెప్టెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రైతుల గుండెల్లో అల్పపీడనం రైళ్లు

గత నెల రోజుల్లో రికార్డు స్థాయిలో వర్షం - మళ్లీ వానలతో ఇబ్బందులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

బంగాళాఖాతంలో మళ్లీ అల్పపీడనం ఏర్పడటంతో రైతుల గుండెల్లో రైళు పరిగెడుతున్నాయి. అల్పపీడనం ప్రభావంతో సోమవారం సాయంత్రం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తాడేపల్లి, మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ, పెదకాకాని, దుగ్గిరాల, తెనాలి, మేడికొండూరు తదితర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల జల్లులు పడ్డాయి.

జిల్లాలో గత నెల 30,31 తేదీల్లో భారీ వర్షాలకు వేలాది ఎకరాలు పైరు నీట మునిగింది. ఈ ముంపు నుంచి బయటపడిన, పూర్తిగా దెబ్బతిన్న పంటలను తొలగించి మళ్లీ పంటలు వేసుకోవడానికి పలువురు రైతులు సిద్ధమవుతున్నారు. 50 శాతానికి పైగా దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో మళ్లీ వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే దాదాపు దెబ్బతిన్న పంట మళ్లీ వర్షాలు కురిస్తే పూర్తిగా కోల్పోయినట్టేనని, ఇప్పటికే నిబంధనల పేరుతో పరిహారం వచ్చే జాబితాల్లో తమ పేర్లు లేవని, ఇప్పుడు మళ్లీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నా పరిహారం వస్తుందో రాదో తెలియడం లేదని గత నెల రోజుల కాలంలో గోడ దెబ్బ, చెంప దెబ్బలతో అల్లాడుతున్నామని రైతులు వాపోతున్నారు.

భారీ వర్షాలతో తొలుత 83 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని నివేదిక రూపొందించారు. తరువాత తుది సర్వేలో 41,432 ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందని అంచనా వేశారు. 33 శాతానికి మించి పంట నష్టం తక్కువగానే జరిగిందని, ఎక్కువ రోజులు నీరు ఉండటం వల్ల పంట మొత్తం నష్టపోయిందని అంచనా వేశామని, కానీ పొలాల్లో నీరు తొలగిన తరువాత స్వల్ప జాగ్రత్తలు తీసుకుంటే పంట నిలదొక్కుకుంటుందని అంచనా వేసినట్టు అధికారులు తెలిపారు. తాజాగా గణాంకాలు ప్రకారం 24,212 మంది రైతులకు చెందిన 41,432 ఎకరాల్లోనే వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ.10 వేలు చొప్పున రూ.41.06 కోట్ల సాయం అవసరం అవుతుందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో పరిహారం దక్కని మరో 42 వేల మంది రైతులు అయోమయంలో ఉన్నారు.

ప్రస్తుతం ఖరీఫ్ సాగు ముగింపు దశకు చేరింది. ఈ నెలాఖరు వరకు సాగును ఖరీఫ్‌గా పరిగణిస్తారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 1.64 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా ఉండగా ఇప్పటి వరకు 1.38 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకు వరి సాగు చేయని వారు వచ్చే నెలలో రబీ కింద ఇతర పంటలను సాగు

▶ 2లో

బ్యాంకుకు తాళం వేసి ఆందోళన చేస్తున్న బాధితులు

బ్యాంక్‌కు తాళం వేసి మళ్లీ ధర్నా

పరిహారం కోసం దొడ్లేరు సిజిజిబి ఎదుట బంగారం మాయం బాధిత రైతుల ఆందోళన

ప్రజాశక్తి - క్రోసూరు

దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో బంగారం మాయం ఘటనలో నష్టపరిహారంపై కోసం బాధితులు మరోసారి ఆందోళన చేపట్టారు. బ్యాంకుకు సోమవారం తాళం వేసి ధర్నా చేశారు. కౌలురైతు సంఘం జిల్లా నాయకులు టి.హనుమంతరావు మాట్లాడుతూ 14 నెలలుగా బాధితులు నష్టపరిహారం కోసం నిరీక్షిస్తున్నారని, అధికారులు, పోలీసులకు ఇప్పటికే పలుమార్లు విన్నవించినా, బ్యాంకు వద్ద ఆందోళనలు చేసినా ఇంకా సగం మందికి పరిహారం దక్కలేదని తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ స్పందిస్తూ 500 మంది బాధిత రైతులకుగాను, ఇప్పటివరకు 270 మందికి నష్టపరిహారం చెల్లించామని, మరొక 40 మందికి చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అయితే బాధితులందరికీ పరిహారంపై స్పష్టమైన హామీ కోసం రైతులు పట్టుబట్టారు. ఎస్ఐ కలుగజేసుకుని భాధిత రైతుల కమిటీ, బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడారు. బంగారాన్ని దొంగిలించిన అప్పటి అప్రైజర్ నాగారాజును తీసుకొచ్చి మరోసారి విచారణ చేస్తామని, ఆ వివరాల ఆధారంగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. దీంతో రైతులు ఆందోళన విమరించారు. ధర్నాలో డి.నటరాజు, ఈశ్వర్‌రెడ్డి, రవుఫ్, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో రూ.కోటి వసూలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశారని పలువురు బాధితులు సోమవారం జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్‌ను ఆశ్రయించారు. రైల్వే, జిల్లా కోర్టులో ఉద్యోగాలంటూ 10 మంది నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల చొప్పున రూ.కోటి వసూలు చేశారని చిలకలూరిపేటకు చెందిన జి.శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేశారు. ఇదిలా దాదాపు నెల రోజుల తరువాత జిల్లాలో గ్రీవెన్స్ నిర్వహించడంతో సోమవారం పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఫిర్యాదుల్లో ఎక్కువగా మోసం, అధిక కట్నం కోసం అత్తింటి వారి వేధింపులు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు సంబంధించినవి ఉన్నాయి

పెదనందిపాడులో వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు

ప్రజాశక్తి -గుంటూరు,
పెదనందిపాడు, పల్నాడు జిల్లా

నరసరావుపేటలో కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్‌లో, విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు గుంటూరు, పెదనందిపాడు, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సోమవారం అర్జీలు అందజేశారు. గుంటూరులో బిఆర్ స్టేడియం ఎదురు నిర్మాణం పూర్తయిన కోడిగుడ్డు సత్రం హాస్టల్లో విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, ఎయిడెడ్ కాలేజీల్లో అధిక ఫీజులు నియంత్రించాలని, బీసీ హాస్టల్స్‌లో మెనూ సక్రమంగా అమలు చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణను అరికట్టాలని, తల్లికి వందనం వెంటనే ప్రారంభించి, నిధులు విడుదల చేయాలని, జీవో 77 రద్దు చేయాలని, తదితర డిమాండ్లపై వినతి పత్రం అందజేశారు. అర్జీ ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు

▶ 2లో

పొలానికి నీరు పెట్టే ప్రయత్నంలో కౌలురైతు మృతి

ప్రజాశక్తి- మాచర్ల

నీటిమడుగులో పాడైపోయి ఉన్న మోటారును తీయడానికి ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తు కౌలురైతు మృతి చెందిన సంఘటన దుర్గి మండలం తేరాలలో సోమవారం చోటుచేసు కుంది. గ్రామానికి చెందిన కూడలి శ్రీనివాసరావు (40) మూడెకరాలను కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేస్తున్నాడు. ఇటీవల వర్షాల నేపథ్యంలో క్వారీ గుంతల్లోకి నీరు చేరాయి. వీటినే రైతులు మోటార్ల ద్వారా పొలాలకు పెట్టుకుంటున్నారు. ఇదే తరహాలో శ్రీనివాసరావు కూడా తన పొలానికి నీరు పెట్టడానికని సోమవారం ఉదయం వెళ్లాడు. అయితే మోటారు పాడైపోవడాన్ని గమనించి దాన్ని నీటిలో నుండి బయటకు తీసేందుకు గుంతలో దిగి జారి నీటిలో పడ్డాడు. కొద్దిసే పటికి అటుగా వచ్చినవారు గమనించి పరిశీలించగా అప్పటికే శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దుర్గి పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు సీతారాం ఏచూరి సంస్మరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్క్సిస్టు మేధావి, సిపిఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ మంగళవారం సా యంత్రం 6 గంటలకు బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయలో జరుగుతుందని ఆ పార్టీ నగర కార్యదర్శి కె.నళినీకాంత్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను సిపిఎం పార్టీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నళినీకాంత్ మాట్లాడుతూ సభలో ప్రధాన వక్తగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మస్తాన్‌వలి, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, డిబిఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు ప్రసంగిస్తారని చెప్పారు. దేశ రాజకీయాల్లో ముఖ్యంగా మతతత్వ విధానాలు, ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా సీతారాం ఏచూరి పోరాడారన్నారు. 2024 ఎన్నికల్లో ఇండియా కూటమి ఏర్పాటులోనూ ఆయన ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ ఏచూరిని గుర్తిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, నాయకులు షేక్ ఖాశిం షహీద్, బి.సత్యనారాయణ, ఆది నికల్సన్, ఎ.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల గుండెల్లో అల్పపీడనం రైళ్లు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ప్రధానంగా మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర సాగు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం 1.38 లక్షల ఎకరాల్లో 38 వేల ఎకరాల్లో వరి ముంపునకు గురై నష్టం జరిగిందని అధికారులు నిర్ధారించగా మిగతా లక్ష ఎకరాల్లో వివిధ దశల్లో వుంది. ఈ పరిస్థితుల్లో తుపాను వస్తే మళ్లీ నష్టం జరుగుతుందని రైతులు ఆందోళనలో ఉన్నారు. పత్తి 66 వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా ఉండగా ఇప్పటి వరకు 51 వేల ఎకరాల్లో సాగు చేశారు. పత్తి కూడా చాలా ప్రాంతాల్లో మొదటి దశ తీతలకు సిద్ధం అవుతోంది. ఈ దశలో భారీ వర్షాలు కురిస్తే పూత, కాయ రాలిపోయే ప్రమాదం ఉంది. 50 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు కేవలం 9 వేల ఎకరాల్లోనే సాగు చేశారు. మిర్చికి కూడా ఇప్పట్లో నీటి అవసరం లేదని చెబుతున్నారు. అధిక వర్షాలు కురిస్తే మిర్చి ఉరకెత్తి పైరుకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. పసుపు, ఇతర ఉద్యాన పంటలు ఇటీవల కురిసిన వర్షాలకే చాలా వరకు నష్టం జరిగింది. ముంపు బారిన పడకుండా ఉన్న పైర్లకు ప్రస్తుతం నీటి అవసరం లేదని అయితే అధిక వర్షాలు కురిస్తే ఇబ్బందేనని చెబుతున్నారు.

నాలుగు నెలలుగా అధిక వర్షమే...

జిల్లాలో సెప్టెంబరులో 145.2 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు 242.9 మిల్లీ మీటర్లు నమోదైంది. ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టులో కూడా అవసరానికి మించి వర్షం కురిసింది. జూన్‌లో 97.1 మిల్లీ మీటర్లకు గాను 160.5, జులైలో 164.9 మిల్లీమీటర్లకు గాను 214.2, ఆగస్టులో 164.7 మిల్లీ మీటర్లకు గాను 193.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎ.యశ్వంత్, ఎస్.కె.సమీర్, దాసు, సురేష్ తదితరులు ఉన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యల పరిష్కారం కోసం పెదనందిపాడులోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ కళాశాలల్లో, మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

నరసరావుపేటలో పల్నాడు జిల్లా కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.సాయికుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియను వెంటనే ఆపాలన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక, సరైన సదుపాయాల్లేక వాటిల్లోని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఏడు నెలలుగా మెస్ ఛార్జీలు ఇవ్వడం లేదని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని కోరారు. డిగ్రీ మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాని, పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను రద్దు చేస్తు గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాన్నారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్, కాలేజీ భవనా స్థానంలో నూతన భవనాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డి.అమూల్య, రోహిత్, షాదుల్లా, ఫణి, యాసీన్, సత్తి పాల్గొన్నారు.

చిర్రావూరులో పశువుల మేత పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కృష్ణానది వరదల దాటికి లంక గ్రామమైన చిర్రావూరిలో పశువులకు మేత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ అన్నారు. సోమవారం రైతు సంఘం నాయకులతో కలసి, చిర్రావూరులో నెల్లూరు నుంచి తీసుకువచ్చిన వరి (వరిగడ్డి)100 మోపుల పశువుల మేతను రైతులకు ఆయన పంపిణీ చేశారు. నాయకులు వై.వెంకటేశ్వరరావు, చిన్ని తిరుపతయ్య, కె.కాశయ్య పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కార్మికులకు, కార్మిక రంగానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండు సిఐటియు, ఎఐటియుసి నాయకులు చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నేడు ఆందోళన కార్యక్రమాల పిలుపులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని చిత్రాలయ సెంటర్ వద్ద సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక కర్షకులు, ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బిజెపి అవలంబిస్తున్న ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను విడనాడకపోతే సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఇతర ప్రజా సంఘాలను ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు సిలార్ మసూద్, నాయకులు మస్తాన్ వలి, సుభాష్ చంద్రబోస్, ఎఐటియుసి అధ్యక్షులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, ప్రజాసంఘాల నాయకులు బ్రహ్మయ్య, నాగేశ్వరరావు, హుస్సేన్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ, పికెఎస్ నాయకులు కంబాల ఏడు కొండలు పాల్గొన్నారు.

విఆర్ఎలకు పేస్కేలు అమలు చేయాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి

విఆర్ఎలందరికీ పే స్కేలు అమలు చేయాలని, అర్హత ఉన్న వారికి విఆర్ఓలుగా ప్రమోషన్ ఇవ్వాలని విఆర్ఎల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా సమావేశం ప్రధాన కార్యదర్శి ఆనందరాజు అధ్యక్షతన స్థానిక సత్తెనపల్లి సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు షేక్ బందగి సాహెబ్ మాట్లాడుతూ నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్ఎలుగా నియమించాలని, నైట్ వాచ్మెన్ అటెండర్ డ్యూటీలను రద్దు చేయాలని, 2005 విఆర్ఏ సర్వీసు రూల్స్ ప్రకారం వీఆర్ఏలను ఉపయోగించుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల సంఘం గౌరవ అధ్యక్షురాలు మల్లేశ్వరి, అమరావతి మండల అధ్యక్షులు రాజు, సత్తెనపల్లి మండల అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి మునాఫ్, ఉపాధ్యక్షులు బ్రహ్మయ్య, బెల్లంకొండ ప్రధాన కార్యదర్శి శ్రీను సాహెబ్, దుర్గి మండల అధ్యక్షులు వెంకటేష్, రెంటచింతల మండల నాయకులు కనకయ్య పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ : నియోజకవర్గంలో రైతులకు ఎరువుల కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎడిఎ బోయపాటి రవిబాబు అధ్యక్షతన ఎరువుల సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎరువుల డీలర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో 3115 మెట్రిక్ టన్నుల డిఏపి అవసరమని, ఆ మేర ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడుతో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఫోన్లో మాట్లాడి రైతుల సమస్యలను వివరించారు. నియోజవర్గ రైతులకు అధికారులు, డీలర్లు మెరుగైన సేవలు అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి, ఐదు మండలాల ఏవోలు, వినుకొండ పట్టణంతో పాటు, ఫర్టిలైజర్స్ వ్యాపారులు, డీలర్లు పాల్గొన్నారు.

తిరుమల ఇంజినీరింగ్‌లో వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా : నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామ పరిధిలోగల తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తతీయ సంవత్సరం ఈసీఈ చదువుతున్న విద్యార్థులకు విజయవాడకు చెందిన మైక్రోలింక్ పెరిఫరల్ కంట్రోలర్స్ కంపెనీ ఐ ఓ టి అనే అంశంపై రోజుల పాటు నిర్వహించనున్న వర్క్ షాప్ సోమవారం ప్రారంభమైంది. ఈ వర్క్ షాప్ ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు అర్డునో ప్రోగ్రామింగ్, ఆటోమిషన్, బేసిక్ సెన్సార్ తదితర

అంశాలపై అవగాహన కల్పించేందుకు వర్క్ షాప్ నిర్వహించామన్నారు. ఇటువంటి వర్క్ షాప్ నిర్వహణ ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందెందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు గోవిందరావు, ఈసీఈ విభాగాధిపతి జగదీష్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా ఎంపిడిఒల బదిలీ

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సాధారణ బదిలీల్లో భాగంగా భారీగా ఎంపిడిఒ బదిలీలు జరిగాయి. జిల్లా పరిధిలో 26 మందికి ఇదే జిల్లాల్లో ఒక మండలం నుండి వేరొక మండలానికి బదిలీ కాగా, 16 మంది ఇతర జిల్లాల నుండి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

పేరు	ప్రస్తుతం	నియామకం
పి.జె.విలియమ్స్	మంగళగిరి	ముప్పాళ్ల
మహబూబ్ సుభాని	అమృతలూరు	చెరుకుపల్లి
జి.కాశయ్య	పిడుగురాళ్ల	నకిరేకల్లు
ఎ.శ్రీనివాసరావు	పొన్నూరు	దుగ్గిరాల
ఐ.సత్యనారాయణ	కొల్లూరు	పి.వి.పాలెం
కె.శివపార్వతి	రేపల్లె	ప్రత్తిపాడు
పి.ఉమాదేవి	అమరావతి	కారెంపూడి
కె.నరసింహారావు	పెదకూరపాడు	కొల్లూరు
కె.సమతావాణి	దుర్గి	తాడికొండ
యం.శోభారాణి	దాచేపల్లి	రేపల్లె
వై.హనుమారెడ్డి	యడ్లపాడు	బెల్లంకొండ
కె.సరోజినిదేవి	మాచర్ల	రెంటచింతల
ఫణికుమార్ నాయక్	గురజాల	మాచర్ల
వి.విజయలక్ష్మి	కొల్లిపర	కొల్లిపర
టి.సుగుణమ్మ	చుండూరు	మంగళగిరి
పి.పుట్టారెడ్డి	ముప్పాళ్ల	దుర్గి
జి.వి.సత్యనారాయణ	సత్తెనపల్లి	రాజుపాలెం
పి.రామకృష్ణ	కాకుమాను	పెదకూరపాడు
ఎన్.వెంకటేశ్వరరావు	నర్సరావుపేట	సత్తెనపల్లి
జి.చంద్రశేఖర్‌రావు	భట్టిప్రోలు	పొన్నూరు
బి.మాటుతి శేషాంబ	పి.విపాలెం	అమృతలూరు
బి.శివన్నారాయణ	తుళ్లూరు	వేమూరు
కె.ప్రభాకరరావు	మేడికొండూరు	నాదెండ్ల
ఎ.దీప్తి	తాడికొండ	తెనాలి
బి.బాబూరావు	చేబ్రోలు	బాపట్ల
ఆర్.శ్రీనివాసరావు	కృష్ణా జిల్లా	పెదకాకాని
కె.శ్రీనివాసరావు	కృష్ణాజిల్లా	అచ్చంపేట
యం.రమేష్‌బాబు	కృష్ణాజిల్లా	వట్టిచెరుకూరు
ఎస్.వి.రమణ	కృష్ణాజిల్లా	భట్టిప్రోలు
కానూరి శిల్ప	కృష్ణాజిల్లా	తుళ్లూరు
జి.లక్ష్మీదేవి	ప్రకాశంజిల్లా	పెదనందిపాడు
కె.లలిత	ప్రకాశం	చేబ్రోలు
టి.చందన	ప్రకాశం	మేడికొండూరు
యుగ కీర్తి	ప్రకాశం	కాకుమాను
ఎన్.సుదీప	ప్రకాశం	చుండూరు
వి.హేమలతాదేవి	ప్రకాశం	యడ్లపాడు
టి.పార్వతి	ప్రకాశం	అమరావతి
సిహెచ్.రామచంద్రరావు	ప్రకాశం	పిడుగురాళ్ల
బి.శ్రీనివాసరావు	ప్రకాశం	గుంటూరు
టి.వి.కృష్ణకుమారి	ప్రకాశం	నర్సరావుపేట
ఎ.శ్రీనివాసరావు	ప్రకాశం	కర్లపాలెం

సీనియర్స్ విభాగంలో విజేతలుగా కృష్ణాజిల్లా ఎడ్ల జత

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ప్రదర్శన సోమవారం జరిగిన సీనియర్స్ విభాగంలో కృష్ణ జిల్లా ఎడ్ల జతలు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పెదపులిపాకు చెందిన గరికపాటి శ్రీధర్ ఎడ్ల జతలు2385.3 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివ కృష్ణ చౌదరి ఎడ్ల జతలు 2123 అడుగులతో రెండోస్థానం, నంద్యాల జిల్లా, సిరివెల్లె మండలం గుంపరమదిన్నెకు చెందిన కుందూరు రంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత 2133.2 అడుగులతో మూడోస్థానం, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్ల జత 1936.11 అగుగులతో నాల్గో స్థానం, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పులగం తెషగ్నరెడ్డి, జస్వతరెడ్డి జత 1913.6 అడుగుల దూరంతో ఐదోస్థానం, పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెట్లకు చెందిన కటకం వెంకటేశ్వర్లు ఎడ్ల జత 1831.2 దూరంతో ఆరోస్థానం, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని ప్రగతి రిసార్ట్‌కు చెందిన మేకా రామకృష్ణ ఎడ్లజత 1599 అడుగులతో ఏడోస్థానం, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పులగం తెషగ్నరెడ్డి, జస్వతరెడ్డి జత 1203.2 అడుగులతో ఎనిమిదో స్థానం దక్కించుకున్నాయి. ఆయ ఎడ్లజతల యజమానులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - యడ్లపాడు

ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డుపక్కన ముళ్ల కంచెలోకి దూసుకుపోయిన ఘటన సోమవారం మండలపరిధిలో చోటు చేసుకుంది. బస్సులో 30 మంది ప్రయాణీకులు ఉన్నప్పటికీ ప్రమాదం చోటు చేసుకోక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణీకులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చంఘీజ్‌ఖాన్ పేట సంతపేట గ్రామాల మధ్య చిలకలూరిపేట ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ముళ్ళకంచెలోకి దూసుకు పోయింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొనటంతో విద్యుత్ వైర్లు తెగి పడిపోయాయి. ఈ సమయంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ లైను ట్రిప్ అవడంతో పెను ప్రమాదం తప్పింది. వివారాలు తెలియాల్సి ఉంది.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - తెనాలి

మద్యానికి బానిసైన యువకుడు క్షణకావేశంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ టు టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ పరిధిలోని సంఘం జాగర్లమూడికి చెందిన మోదుగుల వెంకటేష్ (32) అయితానగర్‌లో ఉంటూ పట్టణంలో ఓ జ్యువెలరీ షాపులో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన వెంకటేష్ భార్య పిల్లలను వేధించేవాడు. కొద్దికాలంగా ఆన్లైన్ గేమింగ్ కు బానిసయ్యాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన వెంకటేష్ భార్యను పిల్లలను కొట్టాడు. తదుపరి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అతన్ని ప్రైవేటు వైద్యశాలకు తరలించిగా అప్పటికి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తెనాలి

ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పట్టణ ఒన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన షేక్ కరిముల్లా (40) మార్కెట్లో పండ్ల వ్యాపారి. కుమార్తె ప్రేమ వివాహాన్ని ఆపాలని బెదిరించడానికి ఆదివారం మద్యంలో ఎలుకల మందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని తెనాలి వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ కరిముల్లా సోమవారం ఉదయం మృతి చెందినట్లు వైధులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-ఈపూరు

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురు ఢీకొని ఇద్దరికీ గాయాలైన సంఘటన మండలంలోని బొమ్మరాజు పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఊడిజర్ల గ్రామానికి చెందిన బోగి రెడ్డి లక్ష్మిరెడ్డి రొంపిచెర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా భద్రుపాలెం గ్రామం నుండి ఈపూరు వైపు రుంజుల ప్రేమానందం ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆటోను దాటే క్రమంలో అదుపుతప్పి రెండు వాహనాలు వేగంగా ఢీకొనడంతో లక్ష్మిరెడ్డికి తీవ్ర గాయాలు కాగా వినుకొండ తరలించి అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు. ప్రేమానందం కు గాయాలు కావడంతో ఈపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి వినుకొండ ఆసుపత్రికి తరలించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని హౌసింగ్ లేఅవుట్లలో, సొంత స్థలాల్లో మంజూరు చేసిన ఇళ్లలో అప్షన్ 1, 2 విభాగంలో నిర్మిస్తున్న ఇళ్ళను వేగవంతంగా పూర్తి చేయటానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమాన్ని నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేలా సంబంధిత శాఖల అధికారులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి మన ఇల్లు మన గౌరవం, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలపై మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, హౌసింగ్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ లేఅవుట్‌లో, సొంతగానూ అప్షన్ 1 క్రింద స్వయంగాను, అప్షన్ 2 క్రింద ప్రభుత్వం నుంచి నిర్మాణ సామగ్రి తీసుకొని లబ్దిదార్లు ఇల్లు నిర్మించుకుంటున్నారన్నారు. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన మొదటి ఫేజ్‌లో మంజూరు చేసిన ఇళ్ళలో దాదాపు 28,730 ఇళ్ళు అప్షన్ 1, 2లలో నిర్మించుకుంటుకుంటున్నారని తెలిపారు. వీటిలో ఇప్పటి వరకు 11,000 మాత్రమే పూర్తి అయ్యాయన్నారు. శ్లాబ్ లెవల్ పూర్తి అయిన ఇళ్ళను అక్టోబరు నాటికి, ఫౌండేషన్ స్థాయిలో ఉన్న ఇళ్ళను మార్చి 2025 నాటికి పూర్తి అయ్యేలా అధికారులు లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణ పురోగతిపై 24, 25 తేదీల్లో అధికారులతో, 26న సచివాలయ సిబ్బందితో, 28న లేఅవుట్లలో లబ్దిదారులతో సమావేశాలు, సదస్సులు నిర్వహించాలన్నారు. మొదటి ఫేజ్‌లో మంజూరు చేసిన ఇళ్ళను మార్చి 2025 నాటికి ఖచ్చితంగా పూర్తి చేసుకోవాలని, నిర్దేశిత సమయం దాటిన తరువాత ఇంటి నిర్మాణ నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికీ ఆర్థిక సహాయం అందించటం కుదరదని లబ్దిదారులకు స్పష్టంగా తెలియచేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సీపీఓ శేషశ్రీ, జిల్లా ఉపాధి అధికారి రఘు, జిల్లా పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు సుధాకర్ పాల్గొన్నారు.

అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No: 2009/2022
I.A.NO: 2010/2022
I.A.NO: 2011/2022
IN
O.S.NO: 103/2014

తిరువీధుల శివపార్వతి .....పిటిషనర్ /వాది
V/s
ముప్పా పున్నమ్మ వగైరాలు
... రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

NOTICE

To
R7) సాదినేని సుబ్బాయమ్మ
W/o వెంకటరామయ్య గోరంట్ల, గుంటూరు జిల్లా.

పై దావాలో వాది, చనిపోయిన ముప్పా పున్నమ్మ కు మిమ్ములను వారసులుగా చేర్చమని కోరుచూ I.A.No : 2011/2022 నెంబరున పిటిషను వాది దాఖలు చేసినది. అదేవిధంగా సదరు ముప్పా పున్నమ్మ వున్న ఎబెట్ మెంట్ ఆర్డర్ రద్దు చేయమని కోరుచూ I.A.No: 2010/2022 నెంబరున పిటిషను దాఖలు చేసినది. సదరు ఎబెట్ మెంట్ ఆర్డర్ రద్దు చేయమని కోరుటలో జరిగిన ఆలస్యమును క్షమించమని కోరుచూ I.A. No : 2009/2022 న పిటిషను దాఖలు చేసినది. సదరు పిటిషన్ల పై మీకేమైనా అభ్యంతరములు వున్నచో అట్టివి తేది 04-10-2024 న ఉదయం 10.30 ని.లకు పై కోర్టు ఎదుట హాజరై తెలుపుకొనగలరు. లేనిచో పిటిషన్లు మీ పరోక్షమందు తీర్మానం కాగలవు.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //

ఇట్లు
వెలగపూడి సుబ్రహ్మణ్యం
పిటిషనరు తరపు న్యాయవాది,
అద్దంకి

అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No: 506/2022

కాకాని రాధాకృష్ణమూర్తి వగైరా .... వాదులు
Vs
ది ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చ్ ప్రైవేటు లిమిటెడ్ ABM కాంపౌండ్. కావలి వగైరాలు
.... ప్రతివాదులు

దావా సమను

To
D3) వేమవరపు వరలక్ష్మి W/o శ్రీనివాసరావు
డోర్ నెం:4-6 -152, గౌతమినగర్, గుంటూరు.

వాదులు ఉత్తర అద్దంకి సర్వే నెంబర్ 100, 100/1, & 100/2 లోని య 2.10 సెంట్ల భూమిని తమకు రిజిస్టర్ దస్తావేజు వ్రాయించి ఇవ్వమని కోరుచూ పై దావా దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం తేది 03-10-2024 కి వాయిదా వేసినారు. కావున మీరు పై తేదిన పైకోర్టు ఎదుట ఉదయం 10.30 ని.లకు హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనగలరు. లేనిచో దావా మీ పరోక్షమందు తీర్మానం కాగలదు.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది : **03-10-2024**

ఇట్లు
వెలగపూడి సుబ్రహ్మణ్యం
వాదులు తరపు న్యాయవాది

IN THE COURT OF THE V ADDL.DIST.JUDGE:: GUNTUR
M.V.O.P.No.607/2023

Between:
Miniga Ankamma Rao & Others .... Petitioners
And
Tammisetty Rama Krishna & Others. .... Respondents

To,
R-1: Tammisetty Rama Krishna, S/o. Venkata Rao, R/o.Anandapeta Beside Police Station, Rentachintala (Po & Md), Painadu Dt., (Owner of crime vehicle Auto bearing No. AP07TF 6343)
R-2: Kamireddy Venkata Krishna Reddy, S/o. Venkateswara Reddy, R/o.Nemalipuri, Rajupalem Mandal Painadu Dist., (Driver of crime vehicle Auto bearing No. AP 07 TF 6343)

పై నెంబరు O.P.ని పిటీషనర్లు యాక్సిడెంటులో మీనిగ రాంబాబు మరణించినందున నష్టపరిహారము కోరుచూ దాఖలు చేయగా సదరు పిటీషన్ లో 1 & 2 వ రెస్పాండెంట్స్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:01-10-2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:01-10-2024

బి.బాలాజీ విశ్వనాథ రెడ్డి,
పిటీషనర్లు తరపు అడ్వకేట్, గుంటూరు,

అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No: 106/2016

చల్లా శ్రీనివాసరావు మరియొకరు .... వాదులు
Vs
పెంట్యాల రామయ్య వగైరాలు......... ప్రతివాదులు

దావా సమను

To
D8) హరి మహాలక్ష్మి
W/o లేటు ప్రేమ్ కుమార్
చినమట్లపూడి(గ్రామం),
నగరం (మండలం), (గుంటూరు జిల్లా)

వాదులు చందలూరు గ్రామం సర్వేనెంబర్ 871/1లోని య.1.60 సెంట్ల భూమి పై తమ హక్కును నిర్ధారణ చేయుమని కోరుచూ పై దావా దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం వాయిదా 21-10-2024 వ తేదికి వేయబడినది. కావున మీ అభ్యంతరములు ఉన్నచో అట్టివి పై తేదిన పైకోర్టు ఎదుట ఉదయం 10.30 ని.లకు హాజరై తెలుపుకొనగలరు. లేనిచో దావా మీ పరోక్షమందు తీర్మానం కాగలదు.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది : **21-10-2024**

ఇట్లు
వెలగపూడి సుబ్రహ్మణ్యం
వాదులు తరపు న్యాయవాది

IN THE COURT OF THE PRL' CIVIL JUDGE (SENIOR DIVISION) NARASARAOPET.
EA. 68/2023, IN EP /23, OS.32/2004.

Javvadi Venkata Sesharatnamma ... Petitioner/DHR/Plaintiff
And
Nathani Ravindranath (Died) & Other's .... Respondants/JDR/Defendants.
1 To 7 & 8 To 10 LRS OF 1 JDR.

To,
(R.8) నతాని విజయలక్ష్మి w/o లేట్ రవీంద్ర నాథ్, డి.నెం 12-17-23/13/1, ప్రకాష్ నగర్, నరసరావుపేట.
R.10) కొనకంచి @ నాతాని శిరీష w/o కోటేశ్వరరావు, 12-17-23/13/1, ప్రకాష్ నగర్, నరసరావుపేట.

పై నెంబరు అమలు దరఖాస్తులో మొదటి జెడిఆర్ చనిపోయినందున అతనికి వారసులుగా చేర్చమని E.A 68/2023 నెంబరున పిటిషన్ దాఖలు చేసి సదరు పిటిషన్ లో మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం వారసుల నోటీసులు పంపించినను మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపర్ నోటీసు ద్వారా పైకోర్టు వారి ఎదుట ది. 15-10-2024 న ఉదయం 10:30 గం.ని లకు పైకోర్టు వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల మీ పరోక్ష మందు తీర్మానించబడును.

వాయిదా ది.15-10-2024.
నరసరావుపేట.
24-09-2024

NALLAPATI LAKSHMI NARAYANAYA,
Advocate for Petitioner/DHR/Plaintiff.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో...

I.A:103/2022, A.S: 100/2024

కుంచనపల్లి ఆదిలక్ష్మమ్మ.. ...అప్పిలెంట్/పిటిషనర్
ఎదిరి
గొడవర్తి నరసమ్మ (Died) వగైరాలు... రెస్పాండెంట్స్
..... నోటీసు..... ః

To,
R7) బొగ్గరం వెంకట సుబ్బమ్మ w/o శ్రీనివాసు, పాండురంగ స్వామి గుడి వెనుక బజారు, నరసరావుపేట పట్టణం & మండలం.

పై నెంబరు పిటిషనర్ మీ తల్లి మరణానంతరం ఆమెకు వారసురాలిగా మీ వగైరాలపై పిటిషన్ దాఖలు చేసి కోర్టు ద్వారా రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు మీకు ఎన్నిసార్లు పంపినను బుద్ధిపూర్వకంగా తీసుకోనందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు జారీకై ఉత్తర్వులు ఇచ్చినందున మీరు ది.30-09- 2024 వ తేదీన ఉదయం 10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ వకీలు గారి ద్వారా కానీ హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోని ఎడల మీ పరోక్షమందు పై వాజ్యమును శ్రీకోర్టు వారు తీర్మానం చేయుదురని ఇందుమూలంగా మీకు తెలియపరచడమైనది.

శ్రీ కోర్టు వారి అనుమతితో..

వాయిదా ది.30-09-2024

ఇట్లు.
గొట్టిపాటి వెంకట సుబ్రహ్మణ్యం,
పిటిషన్ తరపు న్యాయవాది,
అరండల్ పేట, నరసరావుపేట.
సెల్ నెం.8309594090.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు, తెనాలి
O.S. No. 271/2024

Between :
Veeramallu Vara Lakshmi .... Plaintiff
Vs
Nuvvula Padmaja & others ... Defendents

వాది తరపున దాఖలు చేసుకున్న పేపరు ప్రకటన టు

2వ ప్రతివాది : మద్దు నాగేశ్వరరావు, తండ్రి : కృష్ణమూర్తి, వయస్సు 47 సం॥లు, ప్రొ॥ విజయలక్ష్మి మెడికల్స్, కొత్తపేట, తెనాలి.

యీ పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకోనందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు ఆర్డరు వేసియున్నారు. ది. 3-10-2024న సదరు యీ నెంబరు దావా మీ నోటీసుకై వాయిదా అయివున్నది. ఆ రోజున ఉదయం 10-30 గం.లకు యీ పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ, మీ అడ్వకేటుగారి ద్వారా గానీ హాజరు కాగలరు. అలా కాని యెడల దావా మీ పరోక్షమందు తీర్మానింపబడునని ఇందుమూలంగా మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము.

వాయిదా : 3-10-2024

పొత్తూరి నాగేంద్రం,
వాది తరపు అడ్వకేటు.

మహారాజశ్రీ ఫ్యామిలీ జిల్లా జడ్జి వారి కోర్టులో ఒంగోలు

MC NO : 11/24

Between
షేక్ కరిష్మా మరియు ఇతరులు ... పిటిషనర్స్
వర్సెస్
షేక్ సుభాని ..... రెస్పాండెంట్

To
షేక్ సుభాని, S/o షేక్ మస్తాన్,
వయస్సు 35 సంవత్సరాలు
పెదనందిపాడు గ్రామం, గుంటూరు జిల్లా.

మీ నుండి భరణం కోరుతూ పిటిషనరు దాఖలు చేసిన పైMC No :11/24 నందు ఎన్నిసార్లు శ్రీకోర్టు ద్వారా నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు జారీ నిమిత్తం తేదీ30-09-2024కి వాయిదా వేసియున్నారు ఆ రోజున ఉదయం గం.10.30 నిమిషాలకు మీరు గాని లేదా మీతరపు లాయరు గారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోనవలెయను లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
షేక్ కరిముల్లా
పిటిషనర్ తరపు న్యాయవాది,
ఒంగోలు,ప్రకాశం జిల్లా.
సెల్ : **9848111786**

పాస్‌పోర్టు పోయినది

పల్నాడుజిల్లా (పూర్వం గుంటూరు) యడ్లపాడు మండలం, దింతెనపాడు గ్రామస్తుడు మేడూరి అవినాష్ చౌదరి అను నేను ఈ నెల 3వ తేదీన మా గ్రామం నుండి జిరాక్స్ కాపీల కొరకు బైక్‌మీద యడ్లపాడు వెళుచుండగా చేతి సంచి పోయినది. అందులో నా పేరున గల పాస్‌పోర్టు నెం.**V3159207** సర్టిఫికెట్ ఉన్నది. ఎంత వెదికినా దొరకలేదు. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌లో ఇవ్వగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

మేడూరి అవినాష్‌చౌదరి,
దింతెనపాడు వయా తిమ్మాపురం,
యడ్లపాడు - 522233. పల్నాడుజిల్లా.
సెల్ నెం. **97032 59192**

డాక్యుమెంట్లు పోయినవి

పల్నాడుజిల్లా, మండల కేంద్రమైన అమరావతికి చెందిన గోకనపూడి అంజయ్య గారి కుమారుడు సీతారామయ్యకు చెందిన చ.మీ. 313.97 తాలూకు 1303/1974 నెంబరు గల ఒరిజినల్ డాక్యుమెంట్లు 20-08-2024న గుంటూరు నుండి వస్తుండగా మార్గమధ్యలో పోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌లో తెలియజేయగలరు.

ఇట్లు
సీతారామయ్య,
అమరావతి.
సెల్ నెం. **98666 43552**

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో...

A.S 175/2024

కుంచాల రాఘవులు... అప్పిలెంట్
AND
1.పల్లపు సత్యం & వగైరాలు.. రెస్పాండెంట్లు

To,
R2. అనుమంచి సీతామహాలక్ష్మి w/o బికారిరావు, ఉరఫ్ బిందు మాధవరావు R/o D.No: 17వ లైన్, A.T.అగ్రహారం, గుంటూరు.

పై నెంబరు అప్పీలు దావాలో శ్రీ కోర్టువారి ఉత్తరాల ప్రకారం మీకు ఎన్నిసార్లు అప్పీలు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున ఈ పేపర్ నోటీసు ద్వారా పై కోర్టు వారి ఎదుట ది.26-09-2024 న ఉదయం 10:30 గం. ని లకు మీరు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవాలని తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం

వాయిదా ది.26-09-2024

శ్రీ టి రామకృష్ణ,
అప్పిలెంటు తరపు న్యాయవాది,
చిలకలూరిపేట.

TENALI MUNICIPALITY

E-procurement Tender & Recall Short tender Notice

E-procurement Tender & Recall Short tender Notice No. 11,10,06/2024-25/ General Funds & NIT No.25,17/2023- 24/General fund Online tenders are hereby invited from the contractors/ contracting agencies for no.of tender Works :14 for ECV Amount Rs.57.92 Lakhs. The tender document is available for download from 23-09-2024 (04.00pm) onwards and last date for bid submission for tender is on 30-09-2024 (2.30pm) & 07-10-2024 (02.30pm) Further details can be seen at 'e' procurement market Place i.e., "www.apeprocurement. gov.in".

COMMISSIONER
TENALI MUNICIPALITY


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వాగుపై బ్రిడ్జీని పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సిపిఎం 20వ వార్డు మహాసభ స్థానిక కొత్తపేటలో ఆదివారం జరిగింది. సభకు ఎం.తాతారావు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ 19, 20, 21 వార్డుల శ్మశాన వాటికకు వెళ్లే దారిలో ఉన్న వాగుపై బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అధిక ధరలు అదుపు చేయాలని, అన్ని రకాల నిత్యావసర వస్తువులు చౌకధరల దుకాణాల ద్వారా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తొలుత జెండాను తాతారావు ఆవిష్కరించగా ఇటీవల మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. శాఖ కార్యదర్శిగా ఎ.వీరబ్రహ్మం తిరిగి ఎన్నికయ్యారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, ఎం.జగన్నాథరావు, ఎం.సైదమ్మ, ఎ.రామయ్య, కె.చంద్రశేఖర్, ఎం.ఆదినారాయణ, ఎ.శౌరీలు పాల్గొన్నారు.

దుకాణాల్లోని రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఎరువులు, పురుగు మందుల షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి- మాచర్ల

మాచర్ల వ్యవసాయ శాఖ సంచాలకులు జగదీశ్వర్‌రెడ్డి సోమవారం పట్టణంలోని పలు ఎరువులు, పురుగుమందుల షాపులను ఏవో లక్ష్మారెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఆయా షాపులలో రికార్డులు, స్టాక్‌లను పరిశీలించారు. ధరల పట్టిక, రిజిస్టర్ తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదార్లను హెచ్చరించారు.

క్రీడలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సిస్టర్ తుమ్మ సుజాత

బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ తుమ్మ సుజాత అన్నారు. మాచర్ల మండల స్థాయి స్కూల్ గేమ్స్ భాగంగా సోమవారం పాఠశాల నందు అండర్-14, అండర్-17 బాలబాలికలకు అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. పోటీలను హెచ్‌ఎం సిస్టర్ సుజాత ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు పాఠ్యాంశంలో భాగం కావాలన్నారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.ఎక్స్మాస్ జాన్, పిఈటీలు కర్తయ్య, మత్తే కుమార్, లింగం, పవన్, రామారావు, నాగవేణి, మాధురి పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేసి పరిష్కరించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అధికారులు బాధ్యతతో పని చేయాలని, గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి 150 అర్జీలు అందగా వాటిని కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం స్వీకరించారు. ఇదిలా ఉండగా సుదూర ప్రాంతాల నుండి వస్తున్న ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన షెడ్డును కలెక్టర్, జెసి, డిఆర్ఒ ప్రారంభించారు. అర్జీదార్లకు ఫిర్యాదులు రాసిపెట్టేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

సాగుకు వీల్లేకుండా మట్టి తవ్వకం

తాను బతుకుదెరువు కోసం బాపట్ల జిల్లా పర్చూరులో ఉంటుండగా దాన్ని ఆసరా చేసుకుని 5 నెలల క్రితం గ్రామానికి చెందిన కందుల సుధాకర్ రెవెన్యూ అధికారుల సహాయంతో 23 సెంట్ల పొలంలో మట్టిని అక్రమంగా అమ్ముకుని దౌర్జన్యం చేస్తున్నారని నాదెండ్ల మండలం అప్పాపురానికి చెందిన కుర్రా శశిదేవి ఫిర్యాదు చేశారు. మట్టి తవ్వకం వల్ల పొలం సాగుకు పనికి రాకుండా పోయిందని చెప్పారు.

చెరువు స్థలం కబ్జాపై ఫిర్యాదు

నరసరావుపేట మండలం రావిపాడు గ్రామ 95/డిలో 44.5 ఎకరాల విస్తీర్ణం గల చెరువును నిబంధనలకు వ్యతిరేకంగా పలువురు ఆక్రమించి అనుమతులు లేకుండానే ప్రార్థనా మందిరాలు, దుకాణాలు, ఇళ్లు నిర్మించారని గ్రామానికి చెందిన పూదోటి కిషోర్ ఫిర్యాదు చేశారు. నిర్మాణదార్లకు విద్యుత్ శాఖ అధికారులు కూడా సహకరించేలా నిబంధనలకు మీరి విద్యుత్ మీటర్లు మంజూరు చేశారని చెప్పారు. దీనిపై విచారణ చేసి ఆక్రమణల నుండి చెరువును విడిపించాలని కోరారు.

సదరన్ సర్టిఫికెట్ కోసం లంచం అడుగుతున్నారు

కొన్నేళ్ల క్రితం ప్రమాదవశాత్తు కంటికి గాయం కావడంతో కంటి చూపు పూర్తిగా పోయిందని, కన్ను మర్పించినా ప్రయోజనం కలగలేదని, ఈ నేపథ్యంలో సదరన్ సర్టిఫికెట్ కోసం సంప్రదించగా ఒక డాక్టర్ రూ.6 వేలు లంచం తీసుకున్నారని చిలకలూరిపేట మండలం గోవిందపురానికి చెందిన మురికుంట్ల రామకోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ధ్రువపత్రం కావాలంటే రూ.15 వేలు ఇవ్వాలని మరో వైద్యుడు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు.

ఆస్తిని పంచని బాబాయిపై ఫిర్యాదు

తల్లిదండ్రులు చిన్నతనంలోనే అనారోగ్యంతో మృతి చెందగా అమ్మమ్మ సంరక్షణలో ఉంటూ ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ చదువుకుంటు న్నామని, తమ ఉమ్మడి ఆస్తి 61 సెంట్ల పొలం బాబాయి వెబ్‌ల్యాండ్‌లో అతని పేరు మీద నమోదు చేయించుకుని తమకు ఇవ్వడం లేదని దాచేపల్లి మండలం పెదగార్లపాడుకు చెందిన అక్కా తమ్ముడు సింగు వంశీ, శ్రీలేఖ కలిసి తన బాబాయి సింగు నరసింహారావుపై ఫిర్యాదు చేశారు. పట్టా లేకుండా ఉన్న మరో 30 సెంట్లు ఉమ్మడి ఇంటిని ఆయనే ఆక్రమించాడని, 10 నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదని, న్యాయం చేయాలని కోరారు.

భూ సమస్య పరిష్కారంలో రెవెన్యూ నిర్లక్ష్యం

మాచర్ల మండలం రామవరం గ్రామ శివారులో సర్వే నం.2లో 2.57 ఎకరాల భూమిని వంశపారంపర్యంగా అనుభవిస్తున్నామని, ఇటీవల తమ భూమి ఉన్న సర్వే నంబర్ ఎండోమెంట్ కింద నమోదు కాగా సంబంధిత అధికారులను సంప్రదించగా సాంకేతిక సమస్యల నేపథ్యంలోనే తప్పుగా నమోదైందని రాతపూర్వకంగా వివరణిచ్చారని, అయినా రెవెన్యూ అదికారులు ఈ సమస్యను పరిష్కరించడం లేదని మాచర్ల మండలం కంభంపాడుకు చెందిన ధరణి బోయిన నరేంద్రబాబు ఫిర్యాదు చేశారు.

గ్రీవెన్స్‌లో అధికారులకు పల్నాడు కలెక్టర్ ఆదేశం - ప్రజల నుండి 150 అర్జీలు

రిజిస్ట్రార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సోమావరం నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనలు మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం జడ్జి చాంబర్ లాగా ఉండకూడదు నిబంధనను అమలు చేస్తున్నారా? లేదా? అని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ పౌరులకు అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో పి.సరోజిని, తహశీల్దార్ కె.వేణుగోపాల్ ఉన్నారు.

709 మందికి ట్రై సైకిళ్లు పంపిణీ

ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో) సంస్థ, పల్నాడు జిల్లా యంత్రాంగం ద్వారా ఉపకరణాలను నరసరావుపేట పట్టణంలోని వినుకొండ రోడ్డులో గల వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీలో సోమవారం పంపిణీ చేశారు. వికలాంగులు, ట్రాన్సజెండర్లు, వృద్ధులులకు జిల్లా వ్యాప్తంగా గత ఏడాది జులైలో నిర్వహించిన అస్సెస్మెంట్ క్యాంపుల్లో 709 మంది వికలాంగులను గుర్తించారు. కాగా వారికి రూ.32.81 లక్షలతో 193 బ్యాటరీ ట్రైసైకిళ్లను, రూ.1.18 కోట్లతో 861 ఉపకరణములను 516 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, నాయకులు జి.కోటేశ్వరరావు, ఎన్.రామచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు, కార్మిక హక్కులను కాలరాస్తున్న బిజెపి

నిరసనలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - వినుకొండ

దేశానికి పట్టెడన్నం పెడుతున్న రైతుల, కాయ కష్టం చేసి సంపదను సృష్టిస్తున్న కార్మికుల హక్కులను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు విమర్శించారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల పిలుపుమేరకు పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్లో కేంద్ర ప్రభుత్వ విధానాలపై సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, ఎఐటియుసి నాయకులు బి.శ్రీనివాస రావు అధ్యక్షత మహించారు. మారుతివరప్రసాద్, గోపాలరావు మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే 100 రోజుల్లో పంటలకు మద్దతు ఒకటిన్నర రెట్లు పెంచి ఇస్తానని, ప్రతి పేదవాని బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షల వేస్తానని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని, విభజన హామీలు అమలు చేస్తానని విశాఖ రైల్వే జోన్ ఇస్తానని, అమరావతిని ఢిల్లీని తలదన్నే రాజధానిని చేస్తానని హామీనిచ్చిన మోడీ వీటన్నింటినీ విస్మరించి తీవ్రంగా మోసం చేశారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచారని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటు వ్యక్తులకు దశలవారీగా అమ్మజూస్తున్నారని మండిపడ్డారు. దేశ సంబపదను బడాబాబులకు కట్టబెడుగున్నారని, ఇదే క్రమంలో కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తేవడం ద్వారా హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ శక్తుల కొమ్ముగాసే ఈ విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వర్లు, ఆర్.వందనం, కిషోర్, సాంబయ్య, కె.మల్లికార్జునరావు, వెంకటప్పయ్య, రంజాన్ బి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో వరికపూడిసెల పూర్తి

బండ్లమోటూ మైనింగ్‌ను పున:ప్రారంభిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ : వరికపూడిసెల ప్రాజెక్టును ఐదేళ్లలో పూర్తిచేస్తామని, ఇందుకు సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన బొల్లాపల్లిలో సోమవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని నిరుద్యోగ యువకులు, కార్మికులకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం కృషి చేస్తున్నామన్నారు. బండ్లమోటు మైనింగ్‌ను పున: ప్రారంభించి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు 1400 బస్సులు కొనుగోలు చేయాలని అధికారులకు సిఎం ఆదేశాలిచ్చారని అన్నారు. బొల్లాపల్లి మండలంలో పాస్ పుస్తకాల మంజూరులో మాజీ బొల్లా బ్రహ్మనాయుడు భారీ అవినీతికి పాల్పడ్డారని, వీటిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు. పంచాయతీ నిధుల్లో అవినీతి జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు ఎక్కడ ఏ కష్టం వచ్చినా తన దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టిడిపి మండల అధ్యక్షులు జె.గోవింద నాయక్, నాయకుల పి.నాగేశ్వరరావు, హనుమా నాయక్, వెంకటేశ్వర్లు, రంగయ్య, గుండె నాయక్, ఎ.శ్రీను, ఆర్.నారాయణ, మంగబాయ్, అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతు ,సిఐటియు సంఘాల నాయకులు , గుంటూరులో నిరసన తెలియజేస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

పంట నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి - కార్మిక, కర్షక సంఘాల నిరసన - అధికారులకు వినతులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

అకాల వర్షాలకు పంటలు నీట మునిగి, తీవ్రంగా నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఎం టి ఎం సి పరిధిలోని తాడేపల్లి మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ శంకర రావు మాట్లాడుతూ ఆగస్టు చివరిలో కురిసిన అధిక భారీ వర్షాలకు తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో రైతాంగం వేసిన పంటలన్నీ నీట మునిగి, పంటలు పూర్తిగా దెబ్బ తినడంతో రైతాంగం అపార నష్టానికి గురికావాల్సి వచ్చిందని, పంట పొలాలలో వ్యవసాయ మోటార్లు పూర్తిగా నీటిలో మునిగి పోయి పనికి రాకుండా పోయాయని అన్నారు. చిర్రావూరు గ్రామ పరిధిలో లంక పొలాలలో ఉన్న గేదెలు, పశువులు మేసే వరిగడ్డి వాములు సైతం వరదలలో కొట్టుకు పోవడంతో నేడు పశువులకు మేత లేకుండా పోయింద న్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, మాగాణి వేసిన రైతులకు ఎకరానికి రూ.25000, వాణిజ్య ఉద్యానవన పంటలకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రాజధాని రైతు సంఘం అధ్యక్షులు కొర్రపోలు ఈశ్వర రెడ్డి మాట్లాడుతూ రాజధాని అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించాలని, సీడ్ యాక్సిస్ రోడ్డు ప్యాకేజీ పెంచాలని అన్నారు. యు వన్ జోన్ ఎత్తివేసి, రైతంగం మీదకు ఒత్తిడి తీసుకురాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సిఐటియు తాడేపల్లి పట్టణ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 లేబర్ చట్టాలను, నాలుగు కోడ్ లుగా మార్చిందని అన్నారు. వెంటనే కార్మికుల పొట్ట కొట్టే నాలుగు లేబర్ కోడ్లను ఎత్తివేయాలని, కార్మిక హక్కులను రక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ చిర్రావూరు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పశువుల ఆసుపత్రికి పశు వైద్యుడిని వెంటనే నియమించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.కె ఎర్ర ఫీర్ , భక్కి రెడ్డి, ఈమని రామారావు, బూరుగ వెంకటేశ్వరరావు, దొంతి రెడ్డి విజయభాస్కరరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నీరుడు దుర్గారావు, బొబ్బిలి రామారావు, దండమూడి సాంబశివరావు, ఎస్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు : అఖిల భారత కార్మిక సంఘాలు, రైతు సంఘాలు పిలుపులో భాగంగా సోమవారం గుంటూరు, హిమనీ సెంటర్‌లో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు, ఐఎఫ్‌టియు న్యూ జిల్లా నాయకులు కూరపాటి కోటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ ,ఐఎఫ్‌టియు న్యూ జిల్లా నాయకులు కూరపాటి కోటయ్య, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, రైతుకూలీ సంఘం నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడలుగా మార్చడం అంటే కార్మికులను కట్టు బానిసలుగా చేయటమేనని వారు అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న కోర్టు తీర్పులను ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని, నూతన వ్యవసాయ చట్టాల రద్దు కోసం ఏడాదిపాటు ఢిల్లీలో ఆందోళన సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, మాల్యాద్రి, సిఐటియు పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, ఎంసిపిఐ (యు) నాయకులు శ్రీధర్, సిఐటియు అధ్యక్షులు సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మికులు జడ శ్రీహరి, నికల్సన్ తదితరులు పాల్గొన్నారు .

ప్రజాశక్తి - పెదనందిపాడు :రైతు, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాకుమాను మండలంలో రైతు, కౌలు రైతు సంఘం నాయకులు పర్యటించారు. మండలంలో ని గరికపాడు, పాండ్రపాడు, కొల్లిమెర్ల, బి కే పాలెం, వల్లూరు, లింగం గుంట పాలెం

పెదనందిపాడులో వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గ్రామాలలో వారు పంట పొలాలను పరిశీలించారు. అనంతరం కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి భైరగాని శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు మాట్లాడుతూ, వరదల వల్ల పెద్ద ఎత్తున వరి పంట దెబ్బతిందని తెలిపారు. పంట నష్ట నమోదుకు గడువు నెలాఖరు వరకు పెంచాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడానికి భూ యజమాని సంతకం నిబంధనను తొలగించాలని కోరారు. గరికపాడు సచివాలయం వద్ద రైతాంగ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం 25వ తారీకు బుధవారం ఉదయం 11 గంటలకు కాకుమాను మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే నిరసనలో రైతులు, కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చుక్కా యానాదులు, నల్లమోతు రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని జంగంగుంట్ల పాలెం పంచాయితీ పరిధిలోని పొట్లపాడు గ్రామ రైతులు రైతు సంఘం నాయకులు పి నాగేశ్వర రావు, పి లూర్ధు ఆధ్వర్యం లో ఆర్‌బికె లోని విలేజ్ వ్యవసాయ అసిస్టెంట్ ఎర్రసాని రాజుకి కౌల్దారు సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ భూ యజమాని ప్రమేయం లేకుండా కౌల్దారు లకు గుర్తింపు ఇవ్వాలి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



గేయాలు ఆలపిస్తున్న కళాకారులు

ప్రగతి నగర్‌లో ఏచూరి, సన్యాసిరావు స్మృతి గీతాలాపన

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ప్రజావాగ్గేయకారుడు సన్యాసిరావు స్మృతుల గీతాలాపన కార్యక్రమం స్థానిక ప్రగతి నగర్‌లోసిపిఎంశాఖ, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం సామాజిక న్యాయం నిలబెట్టడంలో ఏచూరి చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఏచూరి మరణం అభ్యుదయ, ప్రజాస్వామ్య వాదులకు తీరని లోటని అన్నారు. అలాగే ప్రజావాగ్గేయకారుడు గంగిరెడ్డి సన్యాసిరావు కంటి చూపు లేకపోయినా కార్మికవర్గ దృక్పథంతో గీతాలు రచించాడని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా గాయ కుడు పి.వి.రమణ, లెనినా, ప్రజానాట్యమండలి గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు డి.శ్రీనివాసరావు, పెద్దిరాజు సన్యాసిరావు రచించిన గీతాలను ఆలపించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి సిపిఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్, సన్యాసిరావు చిత్రపటానికి జెవివి జిల్లా నాయకులు జాన్ బాబు పూలమాలవేసి నివాళులర్పించారు. సభకు కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా,పిఎన్ఎం నగర నాయకులు లూథర్ పాల్, డప్పు కళాకారుడు కిన్నెర, ముత్యాలరావు, సమీర్, ప్రగతి నగర్ శాఖ కార్యదర్శి జి.బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆషా కరుణ్, రాజేంద్రప్రసాద్ దంపతుల్ని అభినందిస్తున్న లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

ఘనంగా ఆదర్శ కుటుంబాల ఆత్మీయ వేడుక

ఆషాకరుణ్‌కు పలువురి జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రేమకు కులమతాలు అడ్డు కావని నిరూపించిన 50కి పైగా కుటుంబాలు ఒకచోట చేరటం వసుధైక సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్‌జిఒ కళ్యాణ మండపంలో ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ఆదర్శ దంపతులు ఆషా కరుణ్ రాజేంద్రప్రసాద్ షష్టిపూర్తి వేడుకలు వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల మధ్య వైభవంగా జరిగాయి. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశం, రాష్ట్రం ప్రజల సామాజిక అభివృద్ధి మరచి కులాలు, మతాల మధ్య రాజకీయాలు చేస్తున్న పార్టీలు ఆదర్శ కుటుంబాల వ్యవస్థను చూసి సిగ్గుపడాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఆదర్శ వివాహాలు చేసుకోవాలనుకునే వారికి ఒకే మాటగా, బాటగా నడవాలనే దృఢ సంకల్పం ఉండాలన్నారు. డాక్టర్ కన్నా మాస్టర్ మాట్లాడుతూ కులాంతర వివాహాలు నిలబడాలంటే ఇద్దరు మనుషులు మధ్య మానసిక బంధం దృఢంగా ఉండాల న్నారు. విరసం రాష్ట్ర నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్ మాటా డుతూ ఆదర్శ వివాహాలు సమాజంలో విప్లవాత్మక మార్పునకు నిదర్శనమన్నారు. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విలువలతో కూడిన సామాజిక మార్పులకు ఆదర్శ కుటుంబ వ్యవస్థ దోహదం చేస్తుందన్నారు. తెలుగు భాషా ఉద్యమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా, నగర కార్యదర్శులు పాశం రామారావు, కె నళినికాంత్, టి.భాగ్యశ్రీ బోసు బాబు, పరమేశ్వర రెడ్డి, డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో ఓనం పండగ సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక శ్యామల నగర్ మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం ఓనం వేడుకలు ఘనంగా జరిగాయి. కేరళ రాష్ట్రంలో జాతి, కుల, మతాలకు అతీతంగా జరుపుకునే అతిపెద్ద పండుగ "ఓనం". ఈ పండగ గొప్పతనాన్ని తెలియ జేస్తూ మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించారు. పిల్లలందరూ సాంప్ర దాయ దుస్తుల తో విచ్చేసి రకరకాల పూల రంగవల్లులను ఏర్పాటు చేసి స్కూల్ ఆవరణను అలంకరించారు. ఈ సందర్భంగా పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కె. వి. సెబాస్టియన్, కరెస్పాండె ంట్ మంజు సెబాస్టియన్ ఓనం విశిష్టత గురించి ప్రసంగించారు. పలుపో టీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేసారు.

గుంటూరు ఎంపిడిఒగా బండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు

సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా నుండి బండి శ్రీనివాస రావు గుంటూరు రూరల్ ఎంపిడిఒగా నియమితులై సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీని వాసరావు ఒంగోలు రూరల్ ఎంపిడిగా పనిచేస్తూ గుంటూరుకు బదిలీపై వచ్చారు. కాగా ప్రస్తుతం పనిచేస్తున్న ఆదినారాయణరావు నెల్లూరుకు బదిలీ అయ్యారు. నూతన నూతన ఎంపిడికు కార్యాలయ ఏఒ శోభారాణి, ఇఒఆర్‌డి కె.శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్‌నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకంగా వైద్యశిబిరం నిర్వహించారు. అక్టోబర్ రెండో తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని యుపిహెచ్‌సి ప్రధాన వైద్యులు ఆర్.మానసమంజరి తెలిపారు. ఈ సందర్భంగా 230 మంది పారిశుధ్య కార్మికులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ లక్ష్మీనాయక్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ఆర్.మానసమంజరితో పాటు జనరల్ గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, చెవి, ముక్కు, గొంతు వైద్యనిపుణులు, చర్మవ్యాధి నిపుణులు ఈ క్యాంపులో పాల్గొని వైద్య సేవలందించారు. వార్డుల్లో ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నటుల ఎంటిఎంసి కమిషనర్ అలీంబాష తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర, గురుకుమార్, ఆశ, అంగన్‌వాడీలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

అసైన్డ్ రైతులకు పెండింగ్ కౌలు చెల్లించాలి

సిఆర్‌డిఎ కమిషనర్‌కు అసైన్డ్ రైతులు, సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంత అసైన్డ్ రైతులకు పెండింగ్ కౌలును తక్షణమే చెల్లించాలని అసైన్డ్ రైతులు, సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. దళితులు, ఇతర పేద వర్గాలకు చెందిన అసైన్డ్ రైతులకు మూడు ఏళ్లుగా కౌలు సొమ్ము దక్కక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ వద్ద ఏకరువు పెట్టారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కక్షగట్టి వారికి కౌలు చెల్లించకుండా ముప్ప తిప్పలు పెట్టిందని, వ్యవసాయ పనులు, ఉపాధి అవకాశాలు లేక జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్డ్ రైతులకు పెండింగ్ ఉన్న కౌలు చెల్లించాలని పలుమార్లు అర్జీలు అందజేసినప్పటికీ సిఐడి కేసులు ఉన్నాయనే సాకుతో కౌలు చెల్లించకుండా వైసిపి ప్రభుత్వం కాల యాపన చేసిందన్నారు. ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు స్పందించి మూడు సంవత్సరాల కౌలును అసైన్డ్ రైతుల అకౌంట్లో వెంటనే జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని రవి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని నాయకులు పేరం బాబురావు,పి వెంకటేశ్వరరావు, అసైన్డ్ రైతులు కొప్పుల రమేష్, బిరుదుగడ్డ రాజు, చెరుకూరి రాంబాబు, లాం ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వండి

పోలీసు సిబ్బందికి ఎస్‌పి ఆదేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 89 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందిని ఎస్‌పి ఆదేశించారు.

నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన కొల్లా సుబ్బారావు తనకు చెందిన 6 ఎకరాల భూమిని కాజేసేందుకు నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అతని అనుచరులు కొంతమంది కలిసి మానసికంగా శారీరకంగా వేధింపులకు పాల్పడ్డారని దీనిపై అప్పట్లో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

పోలవరం ప్రాజెక్టు నందు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మెడంపూడి వెంకటేశ్వర్లు రూ.22 లక్షలు డబ్బులు తీసుకొని ఉద్యోగం ఇప్పించకపోవడంతో డబ్బులు ఇవ్వమని అడగగా డబ్బులు అడిగితే 'నన్ను నీ కుటుంబాన్ని నరికి చంపేస్తా'నని బెదిరింపులకు పాల్పడుతున్నాడని నరసరావుపేట మండలం లింగంగుంట్ల అగ్రహారం గ్రామానికి చెందిన పొన్నపాటి సీతారామరెడ్డి ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

రూ.35 లక్షలకు మిర్చి వ్యాపారి టోకరా

రూ.35 లక్షలకు మిర్చి కోనుగోలు చేసి ఆరేళ్ల నుండి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న మిర్చి వ్యాపారి గుంటూరు మిర్చి యార్డులో కమిషన్ ఏజంట్ నాగం శంకరరావుపై కారంపూడి మండలం బట్టువారిపాలెం గ్రామానికి చెందిన ముళ్ళపూడి కొండలు ఫిర్యాదు చేశారు. దీనిపై న్యాయం చేయాలని కారంపూడి పోలీసులను ఎమ్మెల్యే, ఎంపిలను కలిశామన్నారు. ప్రస్తుతం శంకర్ మిర్చి వ్యాపారం చేయడం లేదని స్వగ్రామం ప్రత్తిపాడు మండలం కోయావారిపాలెం గ్రామంలో ఉంటున్నారన్నారు.

15 సెంట్లు ఆక్రమించి దౌర్జన్యం

గ్రామానికి చెందిన పేరం జయరామిరెడ్డి 13 సెంట్ల స్థలాన్ని కబ్జా చేసి దౌర్జన్యం చేస్తున్నాడని దీనిపై మూడేళ్లుగా పోలీసులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని మండల కేంద్రం నకరికల్లుకు చెందిన భువనం షణ్ముఖి ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రశ్నించిన తన కుమారుడిపై కత్తితో దాడి చేసి గాయపరిచారని, జయరామిరెడ్డి నుండి ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని షణ్ముఖి వేడుకున్నారు.

గంజాయి మత్తులో కత్తితో పొడిచాడని ఫిర్యాదు

గత నెల 29 బజారులో కూర్చుని తోటి స్నేహితులతో కాలక్షేపం చేస్తుండగా ఎటువంటి వివాదం లేకపోయినా గంజాయి మత్తులో 17 ఏళ్ల వయసు ఉన్న పేరుపోగు హిమసాగర్ కత్తితో రెండుపోట్లు పొడిచాడని దీనిపై రాజుపాలెం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన జూపల్లి అఖిల్ వర్మ ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో హిమసాగర్ దర్జాగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్‌పిని వేడుకున్నారు.

మోసకారి నుండి డబ్బులు ఇప్పించాలని వినతి

మాచర్ల పట్టణంలో టైర్లు రియల్ ఎస్టేట్ ఇతర వ్యాపారాలు చేసుకుంటూ మోసం చేస్తున్న మహమ్మద్ ఖాన్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పలువురు మహిళలు సోమవారం ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నివేశన స్థలం ఇప్పిస్తానని చెప్పి ఎనిమిది మంది మహిళల వద్ద రూ.23 లక్షల వరకు వసూలు చేశాడని, డబ్బులు వెనక్కు ఇవ్వాలని అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని మాచర్ల పట్టణానికి చెందిన అట్లూరి చంద్రమ్మ నాగమ్మలతోపాటు పలువురు ఫిర్యాదు చేశారు. వృద్ధురాలు అట్లూరి నాగమ్మ మాట్లాడుతూ మోసపోయిన నేపథ్యంలో కుమారులు తనని పట్టించుకోవడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. న్యాయం చేయాలని బాధితులు ఎస్‌పి ఎదుట వాపోయారు.

విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఐక్యు ఓవర్సీస్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో మాచర్ల మండలంలోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సెమినార్ సోమవారం నిర్వహించారు. సందర్భంగా ఐక్యు ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఎమ్‌డి యు.గురుప్రసాద్ విదేశీ చదువులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అమెరికా, యూకే, కెనడాలలో చదువుకుంటే ఎలా ఉంటుంది వాటి వల్ల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అరుణ్, కిరణ్‌కుమార్, రాజు, హెచ్ఓడీలు, యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో పారిశుధ్యం కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఎల్‌ఎ జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం ఉదయం పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, మద్దిగపు చినవెంకటరామిరెడ్డి, డాక్టర్లు ఉదయభాను పాల్గొన్నారు.

ఎంపిడిఓగా పిజె.విలియమ్స్

ప్రజాశక్తి - ముప్పాళ్ల

ముప్పాళ్ల ఎంపిడిఓగా పిజె విలియమ్స్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మంగళగిరి నుండి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి ఎంపిడిఓ పుట్టారెడ్డి బదిలీపై దుర్గి మండలానికి వెళ్ళారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ విలియమ్స్‌కు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

'పొలం పిలుస్తుంది'లో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - ఈపూరు

వ్యవసాయం లాభసాటిగా చేసేందుకు రైతుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ శాఖల అనుసంధానంతో పొలం పిలుస్తుంది కార్యక్రమం చేపట్టిందని ఎఓ ఆర్.రామారావు అన్నారు. నేటి నుండి ఈపూరు మండలంలో గ్రామాల షెడ్యూల్ వారీగా ప్రతి మంగళ, బుధవారాలలోనూ వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి అనంతరం పొలం పిలుస్తుంది గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ వరకు పొలం పిలుస్తుంది గ్రామసభలు ఏర్పాటు చేస్తామన్నారు.

మిద్దెతోట మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో మిద్దె తోటకు అవసరమైన మొక్కలను డిపిఎం అమలకుమారి సోమవారం పంపిణీ చేశారు. కొందరు మహిళలను గ్రూపుగా ఏర్పాటు చేసి మొక్కలు పెంచడానికి కావాల్సిన సలహాలు, సూచనలు ఇస్తున్నామన్నారు. మహిళలు ఆకుకూరలను, కూరగాయలను మిద్దె తోటలు, పెరటి తోటలు వేసి ప్రకృతి వ్యవసాయ విధానములో పండించుకొని ఆరోగ్యవంతమైన తాజా కూరగాయ ఉత్పత్తులు సాధిస్తున్నారన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యూత్ యాక్టివిటీస్‌లో భాగంగా సోమవారం నరసరావుపేట మండలం కేసనపల్లి గ్రామ పరిధిలో గల ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో బాల, బాలికలకు 200 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రోటరీ క్లబ్ ఆర్.ఏ.సి చైర్మన్ వాగ్ధేవి కళాశాల కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయల శ్రీనివాసరావు, ఈశ్వర్ కళాశాల కరస్పాండెంట్ షేక్ కరీం మోహిద్దీన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు కపిలవాయి రాజేంద్రప్రసాద్, సెక్రెటరీ సాతులూరి శివకుమార్, రోటరీ క్లబ్ పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ ఎస్‌కె.జిలానీ మాలిక్, ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఆయా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

29న ఉచితంగా గుండె పరీక్షలు

ప్రజాశక్తి - వినుకొండ

ఈనెల 29వ తేదీన ప్రపంచ వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా వినుకొండ పట్టణంలోని శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రివారు ఉచితంగా గుండె పరీక్షలు నిర్వహిస్తారని ఆస్పత్రి ఎండి గుండె నిపుణులు డాక్టర్ ర్నేశ్వరి తెలిపారు. సోమవారం వైద్యశాలలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 29న వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నుండి వైద్యశాల వరకు ఉదయం ఏడు నుండి 2కె వాక్ నిర్వహిస్తామన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొంటారని తెలిపారు. అలాగే గుండె సంబంధిత వ్యాధులపై ఆసుపత్రి అవగాహన సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 400 మందికి ఉచితంగా గుండె పరీక్షలు చేస్తామన్నారు. అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2కే వాక్‌లో పాల్గొనేవారు తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ నెంబర్లు 92811 07993 మరియు 9281107992. సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా సొసైటీ ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక శ్రీ కనక దుర్గా ఫిషర్ మెన్ సొసైటీ ఎన్నిక ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా అన్నారు. సోమవారం విజయపురిసౌత్‌లోని మత్యకారుల సొసైటీ కార్యాలయం వద్ద మత్స్యకారులతో ఆయన సమావేశం అయ్యారు. సోమవారం నిర్వహించాల్సిన మత్స్యకారుల సొసైటీ ఎన్నిక అనివార్య కారణాలతో వాయిదా పడిందని అన్నారు. మరలా ఎన్నిక నిర్వహించే సమయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారులు నిర్ణయిస్తారని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తెలిపారు. సీఐ వెంట విజయపురిసౌత్ ఎస్ ఐ షేక్ మహమ్మద్ షఫీ,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామంలో జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ సోమవారం పర్యటించారు. దోమల నివారణ చర్యలను పరిశీలించారు. ముందస్తు జాగ్రత్తలతో దోమలు ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, బోదవ్యాధి మెదడ వాపు వ్యాదులను నివారించ వచ్చుని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ ప్రజలకు సూచించారు.

కొనసాగుతున్న 'స్వచ్ఛతా హి సేవ'

ప్రజాశక్తి - వినుకొండ

మండలం లోని నడిగడ్డ గ్రామంలో సోమవారం"స్వచ్ఛతాహి సేవ 2024" కార్యక్రమాన్ని సర్పంచి దేవర సంతోషం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కోఆర్డినేటర్ పి.ప్రభాకర్ స్వచ్ఛ భారత్ నినాదాలని విద్యార్థిని విద్యార్థులు చేత పలికించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. హేమంత్ కుమార్, మాస్టర్ రవి కిరణ్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీలలో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ రాష్ట ప్రభుత్వం తరపున వైద్యారోగ్య శాఖలో విభాగమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు యూత్ ఫెస్ట్ 2024-2025లో భాగంగా హ్ఐవి/ ఎయిడ్స్‌పై స్కూల్ విద్యార్థినీవిద్యార్థులు అవగాహన కోసం రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు ఈ నెల 18న తాడేపల్లిలోని కేఎల్ యూనివర్శిటీలో నిర్వహించారు. ఈ పోటీలలో రాష్టంలోని 26 జిల్లాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు పోల్గొనగా పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం లింగంగుంట్ల శంకర భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని బి.శ్రావణి, 9వ తరగతి విద్యార్థిని జి .నాగశ్రీ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రతిభ చాటిన విద్యార్థులను సైన్స్ ఉపాధ్యాయులు సూరిబాబును అభినందించారు.

పోటీల్లో 'యూనికోడ్' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలలో యూనికోడ్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ శాఖమూరి సుజాత తెలిపారు. ఈ నెల 21, 23 తేదీలలో ఎస్‌జియఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఆటల పోటీలలో సత్తెనపల్లి నియోజకవర్గము నుండి పల్నాడు జిల్లా స్థాయిలో యూనిక్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థుల ఎంపికయ్యారు. సత్తెనపల్లి నియోజకవర్గం నుండి పల్నాడు జిల్లా స్థాయిలో ఆడడానికి ఎంపిక కాబడిన బాలబాలికలను యూనిక్ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ సుజాత, నారాయణ, పిడి అనిల్ అభినందించారు.

అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - తెనాలిరూరల్

ప్రమాద బీమా అధికారులను సంప్రదించి దుగ్గిరాల అగ్నిప్రమాద బాధిత పసుపు రైతులకు న్యాయం చేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ భరోసా ఇచ్చారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం నాయకులు, సబ్‌కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జనవరి 17న జరిగిన అగ్ని ప్రమాదంతో పాటు ఇటీవల కురిసిన వరదలకు పసుపు రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతులు తమ ఆవేదనను వెలబుచ్చారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ జులై 10న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చయ్య నాయుడు సమక్షంలో క్వింటాలుకు రూ.ఏడువేలు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఒప్పందం నాటికి మార్కెట్ ధర క్వింటాలకు రూ.14 వేలు ఉన్నప్పటికీ రూ.ఏడువేలకు ఒప్పందం

కుదుర్చుకున్నామని తెలిపారు. ఒప్పందం కుదుర్చుకున్న నాటినుంచి ఇప్పటివరకూ సహాయం అందకపోవడం శోచనీయమన్నారు. ఒక పక్క అగ్ని ప్రమాదం, మరోపక్క అధిక వర్షాలతో పసుపు రైతులు కుదేలయ్యారని వాపోయారు. తాము విన్నవించిన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సబ్ కలెక్టర్ కు విజ్ఞప్తి చేసినట్లు తెలియజేసారు. రైతులు, కౌలు రైతులకు అన్నదాత పెట్టుబడి సహాయంక్రింద రూ.20 వేలు మంజూరు చేసి, భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ పంట సాగుదారులకు పంట నష్టపరిహారం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అన్నవరపు లంక, బొమ్మువానిపాలెం డ్వాక్రా మహిళల రుణాలను రద్దు చేసి కొత్తగా రూ.లక్ష రుణం మంజూరు చేయాలని, రూ. రెండులక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల రాష్ట్ర కమిటి సభ్యులు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. అనంతరం బాపట్ల జిల్లా రైతు సంఘం అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య రైతు సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో నాదెళ్ల చంద్రశేఖరరావు, సురేంద్ర, రవి లంకిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, చందు సత్యనారాయణ, కొడాలి ఆంజనేయులు, వై.బ్రహ్మేశ్వరరావు పాల్గున్నారు.

మాట్లాడుతున్న పేరెంట్స్ కమిటీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రత పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలి అని చిన్న కొండ్రు పాడు జిల్లా పరిషత్ పాటశాల చైర్మన్ పోతురాజు లక్ష్మి నారాయణ అన్నారు.సోమవారం ప్రత్తిపాడు మండల పరిధిలోని చిన్న కొండ్రు పాడు జిల్లా పరిషత్ పాటశాలలో స్వచ్చత హి సేవలో భాగంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల నుంచి చెత్త సేకరణ కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి షేక్.ఖాజావలి అక్కడి విద్యార్థులకు తడి చెత్త పొడి చెత్తల గురించి తెలియజేశారు. అలాగే వర్మి ఎరువు దాని ఫలితాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలెపు కుమారి,స్వచ్చ భారత్ మిషన్ మండల కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు,పద్మ రాణీ టిచర్,వెల్లి వెల్లి సుబ్బారావు,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రజక కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తిచేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో తాడేపల్లి 13వ సచివాలయం పరిధిలో ధోబికాన స్థలంలో రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.ఆలింబాషాకి ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఈ విషయంపై రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్, మానవ వనరుల విద్య శాఖ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. వెంటనే చిట్యాల ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ పేరుతో నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, మంగళగిరి-తాడేపల్లి నగర సంగం కమిటీ గౌరవాధ్యక్షులు ఎంటి.సుబ్బారావు, అధ్యక్షులు యు.పార్థసారథి, కె.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు వితరణ

ప్రజాశక్తి - తెనాలిరూరల్

సేవే పరమార్ధంగా కొనసాగిస్తున్న సాయిమంగ వెల్ఫేర్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని తెనాలి ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ అన్నారు. సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా ఆర్‌టిసి కార్యాలయంలో సాయిమంగ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ ఎయిడ్ కిట్ల ఉచిత పంపిణీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన, సాయిమంగ సొసైటీ అధ్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్‌తో కలిసి ఆర్‌టిసి బస్సు కండెక్టర్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను పంపిణీ చేశారు. డిపో మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగుల భద్రత, అత్యవసర చికిత్సల నిమిత్తం అందించిన ఫస్ట్ ఎయిడ్ కిట్లు తమ సిబ్బందికి

ఫస్ట్ ఎయిడ్ కిట్లను తీసుకుంటున్న కండెక్టర్లు

ఎంతో ఉపయోగకరమని అన్నారు. తెనాలి నుంచి నడిచే మొత్తం 86 బస్సులకు సరిపడా రూ.10 వేలు విలువైన ఫస్ట్ ఎయిడ్ కిట్లను పంపిణీ చేశారన్నారు. సమాజ సేవకు నడుంబిగించిన సంస్థ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికుల గమ్యస్థానాలకు జాగ్రత్తగా చేర్చే ఆర్‌టిసి సిబ్బందికి మొట్టమొదటగా ఫస్ట్ ఎయిడ్ కిట్లను పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు కంకిపాటి రమేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఐజె.ప్రసాద్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎన్ఎ.నాయక్, సంస్థ కార్యదర్శి ఎ.సుధాకర్, బి.ప్రశాంత్, కె.కిరణ్‌కుమార్, కె.ఉమాశంకర్, బొమ్ము రామకృష్ణరెడ్డి, గెడ్డటి సుందర్ సునీల్ కుమార్, బొనిగల ప్రదీన్, కారుమంచి సునీల్, సందీప్ పాల్గున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని ఇప్పటం గ్రామ టిడిపి అధ్యక్షులు శంకరశెట్టి పిచ్చియ్య, ఆస్టర్ రమేష్ ఆస్పత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో పరిసరప్రాంత ప్రజలకు కార్డియాలజీ, రుమటాలజీ, జనరల్ మెడిసిన్, బీపీ, జిఆర్‌బిఎస్, ఇసిజి, ఉచిత మెడికల్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించారు. అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. తాడేపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, ఇప్పటం గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు గాజుల రాంబాబు, జముడుగాని మహేంద్ర పాల్గొన్నారు.

కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - తెనాలి

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఇ.అన్నపూర్ణ, మున్సిపల్ చైర్మన్ తాడి బోయిన రాధిక, కమిషనర్ బి.శేషన్న ప్రారంభించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

25న పోస్టల్ ప్రత్యేక కవర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భారతదేశంలో సుప్రసిద్ధ తత్వవేత్త ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన పేరుతో ప్రత్యేకంగా పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించనున్నట్లు కొత్త సచ్చిదానందమూర్తి సెంటర్ డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు తెలిపారు. 25 సెప్టెంబర్, 2024 న ఉదయం 11 గంటలకు పద్మ విభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి పేరున పోస్టల్ ప్రత్యేక కవర్‌ను ఆవిష్కరిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు హాజరవుతారని తెలిపారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

సైన్స్ కళాశాలలో 'స్వచ్ఛతా హి సేవా'

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వర్సిటీలో ఉన్న ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న ప్లాస్టిక్ తొలగించారు. సైన్స్ కళాశాల వాలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో బాలుర వసతిగృహాల చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ కె.మల్లికార్జున పాల్గొన్నారు.

పవన్ దీక్షకు మద్దతుగా నాదెండ్ల దీక్ష

ప్రజాశక్తి తెనాలి

గత ప్రభుత్వంలో స్వార్థ ప్రయోజనాల కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని, టిటిడి పవిత్రతను దెబ్బతీశారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. టిటిడిలో లడ్డు కలుషితమైన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా మంత్రి మనోహర్ స్థానిక వైకుంఠపురం ఆలయంలో సోమవారం మహాయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వందల ఏళ్ళ నుంచి స్వామివారికి లడ్డు రూపంలో అందించే మహా ప్రసాదం కోట్లాది మంది భక్తులు భక్తి భావంతో స్వీకరిస్తారన్నారు. అయితే గత ప్రభుత్వంలో కేవలం అహంకార ధోరణితో వ్యవహరించి, స్వప్రయోజనాల కోసం ఆలయాలను ఉపయోగించు కున్నారన్నారు. తిరుపతి దేవస్థానం టికెట్లు అమ్ముకోవ టంలో చూపిన శ్రద్ధ లడ్డు తయారీలో చూపలేకపోయారన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ బందం, నాయకులు ఉన్నారు.

నేడు ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఉచిత లివర్ పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఇన్నర్ రింగురోడ్డు, గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్ వెను ఉన్న వెంకటేశ్వరా ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో నేడు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉచిత లివర్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ చీఫ్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.అలాగే నాడీ పరీక్ష చేసి ముందులు సూచిస్తా రన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

సిఎం సహాయ నిధికి ఐఎంఎ విరాళం

ప్రజాశక్తి - తెనాలి

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలిశాఖ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.51 లక్షల చెక్కును అందించారు. క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సోమవారం కలిసి చెక్కును అందించిన బృందాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ జె.విజయ లక్ష్మి, డాక్టర్ వి.పవని ప్రియాంక, డాక్టర్ కె.అనిల్ కుమార్, డాక్టర్ కె.శ్యామ్ ప్రసాద్, మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ పెండేల వెంకట్రావు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
మంగళవారం 24 సెప్టెంబర్ 2024

షూటింగ్ జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు కెఎల్‌యు విద్యార్థులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

నేలవల్లి ముఖేష్

మద్దినేని ఉమా మహేష్

ఈ నెల 26 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు పెరు దేశంలోని లిమాలో జరగనున్న జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు నేలవల్లి ముఖేష్, మద్దినేని ఉమా మహేష్‌లు ఎంపికయ్యారని వర్శిటీ క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల ఈ పోటీలలో పాల్గొనే భారత జట్టును ప్రకటించిందన్నారు. అందులో గుంటూరు శ్రీనగర్ నాలుగో లైనుకు చెందిన ముఖేష్, విజయవాడ గురునానక్ కాలనీకి చెందిన మద్దినేని ఉమా మహేష్ ఉన్నారన్నారు. వీరిద్దరూ పది పతకాలకు పోటీ పడనున్నారని పేర్కొన్నారు.

వంద రోజుల పాలన ఎలా ఉందో చెప్పండి

ప్రజాశక్తి - తెనాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట ప్రభుత్వం పిలుపునిచ్చిన కార్యక్రమంలో భాగంగా సోమవారం రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టణంలోని పలువురు చిన్న, మధ్యతరహా, హోల్ సేల్ వ్యాపారులను కలిశారు. ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను ప్రజల ద్వారా తెలుసుకున్నారు.100 రోజుల కాలంలో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మనోహర్ వివరించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ బి .శేషన్న, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

కవి శ్రీనివాసరెడ్డికి సాహితీసేవా పురస్కారం

ప్రజాశక్తి - చేబ్రోలు

ప్రముఖ కవి మెట్టు శ్రీనివాసరెడ్డికి మహానుభావా సాహితీ సేవ పురస్కారం వరించింది. ఈ మేరకు ఆయన జయ జయ సాయి ట్రస్ట్ చిలకలూరిపేట నుంచి ఆహ్వాన పత్రికను అందుకున్నారు. జయ జయ సాయి ట్రస్టు చిలకలూరిపేటకు ఆధ్వర్యంలో ఈ నెల 28న గుంటూరులో శ్రీషిరిడి సాయినాథుని 189వ జయంతిని నిర్వహిస్తున్నారని ఆయన చెప్పారు. సాహిత్య రంగంలో చేసిన సేవ ప్రతిభకుగాను పురస్కారాలను అందజేస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు పూసపాటి బాలాజీ తెలిపారు. సాయి జయంతి రోజు మహానుభావా సేవా పురస్కారం తనకు ప్రధానం చేయడం పట్ల శ్రీనివాసరెడ్డి తన ఆనందాన్ని ప్రజాశక్తితో చెప్పారు.

ఎమ్మెల్యే రఘురామపై అట్రాసిటీ కేసు పెట్టాలి

ప్రజాశక్తి - మంగళగిరి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఫ్లెక్సీని చింపిన ఉండీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల సంఘాల రాష్ట్ర జెఏసి కన్వీనర్, హైకోర్టు న్యాయవాది గుర్రం రామారావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో రామారావు మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన ఉండీ నియోజకవర్గంలోని కాళ్లంమండలం, ఏలూరుపాడు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్దనున్న ఫ్లెక్సీని వందమందిగుంపుగా వచ్చి అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ చింపివేయడాన్ని ఖండించారు. ప్రెస్‌మీట్ పెట్టి దళితుల మధ్య చిచ్చు పెట్టిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై కేసు నమోదు చేయాలని కోరారు. దీనిపై మంగళగిరి పట్టణ సిఐ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. మాలసంఘాల నాయకులు యంగలదాసు వెంకట్, దార దుర్గాప్రసాద్, మేరిగ నాగేశ్వరరావు, కోటేశ్వరావు, గుర్రం ప్రకాష్, పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు దేశ సమైక్యతకు విఘాతం

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జమిలి ఎన్నికలు దేశ సమైక్యతకు ప్రమాదం అని ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు అన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో గుంటూరు బాల నంద కేంద్రంలో జమిలి ఎన్నికలు- భారత రాజ్యాంగం అనే అంశంపై సోమవారం సాయంత్రం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రధాన వక్తగా పాల్గొన్న కె.యస్.లక్ష్మణ రావు మాట్లాడుతూ జమిలీ ఎన్నికలు అనేక సాంస్కృతులు,భాషలు ఉన్న భారత సమాఖ్య వ్యవస్థకు విఘాతమని, అదే విధంగా బహుళ పార్టీల వ్యవస్థను నిర్వీర్యం చేసి కేంద్రీకత నియంత్రత్వానికి దోహదపడుతుందని. అంతిమంగా భారత దేశం సమైక్యతకు ప్రమాదం పొంచి ఉందని అభిప్రాయపడ్డారు.ప్రధాన సమస్య అయినా దామాషా ఎన్నికల విధానం దేశ రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చెయగలదని కాబట్టి ప్రజాస్వామ్య వికాసానికి దోహదం చేసే ఎన్నికల సంస్కరణలపై దేశ వ్యాప్తంగా చర్చా జరగాలని అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ జమిలీ ఎన్నికలు ప్రధాన దేశ సమస్యలనుంచి ప్రజల ద్రష్టి మరల్చడానికే అన్నారు. సమావేశానికి రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షులు నడింపల్లి గురుదత్ గారు అధ్యక్షత వహించగా కార్యదర్శి అవధానుల హరి చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, డాక్టర్ సేవకుమార్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి,జొన్నలగడ్డ రామారావు,కిలారి రాజన్ బాబు,సురేష్, డికిటి మల్లికార్జున రావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్, ఎస్ఈసీ ఇండస్ట్రీస్ మధ్య ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

విజ్ఞాన్స్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. సోమవారం వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఈసీ మేనేజింగ్ డైరక్టర్ విద్యాసాగర్ దొంతినేని, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం వలన ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చునన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, ఇండస్ట్రీ- అకాడెమియా ఇంటరాక్షన్స్‌ను నిర్వహిస్తామన్నారు. విద్యార్థు లకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడం, వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులను సరికొత్త టెక్నా లజీల వైపు ప్రోత్సహించడం, వారికి ఆయా రంగాలలో తర్ఫీదనివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

చలపతిలో ముగిసిన ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

బహుమతులు అందజేస్తున్న డాక్టర్ సాయికిరణ్

చలపతి ఫార్మసీ కాలేజిలో వారం రోజులపాటు నిర్వహించిన జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు సోమ వారం ముగిశాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెగా ర్యాలీ నిర్వహించారు. పెయింటింగ్, లీఫ్లెట్, సినిమాటిక్ వీడియో పోటీలు నిర్వహించారు. పెయింటింగ్ పోటీల్లో మొదటి బహుమతి నిర్మల ఫార్మసీ కాలేజి విద్యార్థులు భాగ్యశ్రీ, రితీష్‌చంద్ర, మలినేని లక్ష్మయ్య ఫార్మసీ కాలేజి విద్యార్థులు ఎస్.కె.ఆ్యర్‌భాషా, యం.శ్రీలక్ష్మి ద్వితీయ బహుమతి సాధించారు. సినిమాటిక్ వీడియోలో ప్రథమ బహుమతి చలపతి ఫార్మసీ విద్యార్థులు జి.వంశీకృష్ణ, ఎల్.తేజస్విని, ద్వితీయ బహుమతిని మలినేని విద్యార్థులు ఎస్.కె.కుషియా, పి.సౌమ్య, యం.అమూల్య, పి.జ్యోతి సాధించారు. ముగింపు కార్యక్రమంలో జిజిహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సాయికిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో చలపతి ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జిఎంసి గ్రీవెన్స్‌కు 58 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలు ఇస్తున్న ఆర్జీలను క్షేత్ర స్థాయి అధికారులు నేరుగా పరిశీలించి, అర్జీలు పునరావతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి 58 అర్జీలు స్వీకరించారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 18, ఇంజినీరింగ్ విభాగం 18, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 11, అకౌంట్స్ విభాగంకి సంబందించి 6, ఉపా సెల్ కి సంబందించి 1 ఫిర్యాదు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ మధుసూదన్, ఉపా సెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, డిసిపిలు, ఏసిపిలు, ఈఈలు, ఆర్ఓలు, ఎస్ఎస్ లు పాల్గొన్నారు.

లోకేష్‌కు వినతులు

ప్రజాశక్తి-తాడేపల్లి : ఉండవల్లిలోని తన నివాసంలో నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో పలువురు సోమవారం అర్జీలు అందజేశారు. తాడేపల్లికి చెందిన కె.విజయలక్ష్మి తనకు వికలాంగ పింఛను మంజూరు చేయాలని, మంగళగిరికి చెందిన నాగేంద్రబాబు రెండు కిడ్నీలు పాడైపోయిన తనకు డయాలసిస్‌కు ఆర్థిక సాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. తన కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగళగిరికి చెందిన సూర్యనారాయణ, వైసిపి ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన పింఛనును తిరిగి పునరుద్ధరించాలని మంగళగిరికి చెందిన దాసరి మోజేష్, ఎయిమ్స్ ఆసుపత్రిలో స్వీపర్ ఉద్యోగం కల్పించాలని నులకపేటకు చెందిన అఖిల కోరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. అర్జీలు స్వీకరించిన నారా లోకేష్ సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

ప్రజాసమస్యలపై గ్రీవెన్స్‌కు అర్జీల వెల్లువ

గడువులోగా పరిష్కరించకుంటే అధికారికి సంజాయిషీ నోటీసులు

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 264 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఇతర అధికారులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే ఫిర్యాదులు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, లేదంటే సంబంధత అధికారికి సంజాయిషీ నోటిసులు జారీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ ఏ.భార్గవ్‌తేజ, అసిస్టెంట్ కలెక్టర్ పొవర్ స్వప్నిల్ జగన్నాథ్, డిఆర్ఓ పెద్ది రోజా , డిప్యూటీ కలెక్టర్ గంగరాజు , గుంటూరు ఆర్‌డిఓ శ్రీకర్ ప్రజల నుండి 264 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ప్రజల నుండి అందిన పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ సమీక్షించారు. నిర్ణీత గడువులోపు పరిష్కరించాల్సి వుందని సూచించనప్పటికి ఎక్కువగా రెవెన్యూ, పంచాయితీరాజ్, జియంసికి సంబంధించిన దరఖాస్తులు పెండింగ్ లో వున్నాయన్నారు. సిటిజన్ సంతప్తి జిల్లాలో 77 శాతంగా వుందన్నారు. పారిశుధ్యం, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం, డిపిఓలకు సంబంధించిన అంశాలపై సిటిజన్ సంతృప్తి తక్కువగా వుందన్నారు. అలాగే ఫిర్యాదుల పరిష్కారం మరింత మెరుగ్గా నాణ్యతగా వుండాలన్నారు.

ఇసుక అందుబాటులోకి తేవాలి



బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

ఇసుక అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని సిఐటియు అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు నాయకులు ఇసుక కొరత సమస్యపై అర్జీ అందచేశారు. వందరోజుల సంబరాలు ఎంత మంది కార్మికులకు ఉపయోగపడిందని ప్రశ్నించారు. ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికుల సమస్య పరిష్కరిస్తామని చేసిన వాగ్ధానాలు నెరవేరలేదన్నారు. మొన్నటి వరకూ స్టాక్ పాయింట్లలో గత ప్రభుత్వం కంటే అధిక రేటుకు ఇసుక విక్రయాలు జరిగాయని, ఇప్పుడు వరదల కారణంగా ఇసుక లేదని చెబుతున్నారన్నారు. పనులు లేక కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. అలాగే మెటీరియల్ ధరలు కూడా విపరీతంగా పెరిగాయని, వాటి ధరలు తగ్గించాలని, రాజధాని నిర్మాణంలో స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు ఎ.నికల్సన్, బి.సత్యనారాయణ, కె.శ్రీనివాస్, ఎస్.కె.భాషా, ఖాసింవలి, పి.దీవెనరావు, శ్రీహరి తదితరులు ఉన్నారు.

వాలంటీర్లకు పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

వాలంటీర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని కోరుతూ పొన్నూరు, గుంటూరుకు చెందిన వాలంటీర్లు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్ల సంఘం ఉపాధ్యక్షుడు తాడిశెట్టి భవానీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు పదివేల మంది వాలంటీర్లు పని చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నాలుగు నెలలు అయిందని ఇంతవరకు జీతాలు అందలేదని తెలిపారు.కొన్నిచోట్ల బిల్లులు వేస్తున్నారని, కొన్నిచోట్ల వెయ్యట్లేదని, అసలు మేము కొనసాగుతున్నామో..? లేదో..? అర్థం కావట్లేదన్నారు. వాలంటీర్లుగా పనిచేస్తున్న వారిలో వికలాంగులు, వితంతువులు నిరుపేదలు కూడా ఉన్నారని, ప్రభుత్వం స్పందించి పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

విఓఎ అవినీతిపై విచారణ చేపట్టాలి

ప్రత్తిపాడు మండలం, గొట్టిపాడులో ఆది ఆంధ్రా సమైఖ్య సంఘానికి సంబంధించి విఓఎగా అవినీతిపై విచారణ జరపాలని కోరుతూ సభ్యులు అర్జీలు అందచేశారు. గత 11 సంవత్సరాలుగా యానిమేటర్ మల్లేశ్వరి విధులు నిర్వహిస్తుందని, అప్పటి నుండి సభ్యులు అందరం సభ్యత్వ రుసుం కడుతూనే ఉన్నామని, కానీ అకౌంట్‌లో రూ.56వేలే ఉన్నాయన్నారు. దాదాపు రూ.7.5లక్షలు ఉండాలన్నారు అలాగే శ్రీనిధి లోన్ అప్లికేషన్ కోసం లంచాలు తీసుకున్నారన్నారు. ప్రతి నెలా శ్రీనిధి అమౌంట్, లోన్ తిరిగి చెల్లిస్తూనే ఉన్నామని, కానీ కట్టిన అమౌంట్ సరిపోవట్లేదని గుర్తించామన్నారు. శ్రీనిధిలో కూడా అవినీతి జరిగిందన్నారు. సభ్యుల నుండి రకరకాల రూపాల్లో అక్రమంగా డబ్బులు వసూలు చేసిందని, కావున వాటిపై విచారణ జరిపి, మాకు న్యాయం చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో బి.ఝాన్సీరాణి, పి.జ్యోతికిరణ్మయి, బి.నిర్మల, పార్వతి తదితరులున్నారు.

అట్రాసిటీ కేసులో పరిహారం అందించాలి..

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినప్పటికీ రెండు సంవత్సరాలుగా పరిహారం అందలేదని బాధితురాలి తల్లి దోమల మరియమ్మ గ్రీవెన్స్ అర్జీ అందజేశారు. 2022లో గోరంట్లలో భర్త, అత్తింటి వేధింపుల కారణంగా తన కుమార్తె టి.రేణుక ఆత్మహత్యకు పాల్పడిందని, నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో 2022లో అట్రాసిటీ కేసు నమోదు చేశామని తెలిపారు. కానీ అప్పటి నుండి ఎలాంటి పరిహారం అందలేదని తన కుమార్తెకు ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారని, వారి ఆలనా పాలన చూసేందుకైనా పరిహారం విడుదల చేయాలని కోరారు.

కాలువపై వంతెన నిర్మించాలి..

దుగ్గిరాల, మాదిగపల్లె ప్రవేశం వద్ద తుంగభద్ర డ్రైనేజీ కాలువపై వంతెన నిర్మాణాన్ని వెంటనే చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని గ్రామవాసులు అర్జీ అందజేశారు. 2019 మరమ్మత్తుల పేరుతో వంతెన కూల్చివేశారని, కానీ పునర్నిర్మాణం తీవ్ర జాప్యం జరుగుతుందని అన్నారు. వంతెన లేకపోవటంతో రాకపోకలకుతీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. జాప్యానికి కారణమైన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామానికి, మాదిగ పల్లెకు ఏకైక అనుసంధానం ఈ వంతెన మాత్రమే అని తెలిపారు. కావున వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో చిలువూరు నాగరాజు, రవి, నాగయ్య, కీర్తి ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు సమ్మెకాలం జీతం చెల్లించాలి

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలం జీతం, సంక్రాంతి పండుగ కానుక రూ.వెయ్యి, వెంటనే చెల్లించాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం గ్రీవెన్స్‌లో నగర కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేసిన 17 రోజులు సమ్మె కాలం వేతనం చెల్లించాలని, పండుగ కానుక 1000 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇంతవరకు చెల్లించలేదని అన్నారు.అలాగే జిఎంసి పరిధిలోని వివిధ ఆఫీసులు, పార్కులు, ఇతర చోట్ల పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు యూనిఫారం ఇవ్వాలని గతంలో పలుమార్లు విన్నవించినప్పటికీ ఇవ్వట్లేదని తెలిపారు.బ్యాంకుల ద్వారా పర్సనల్ లోన్లు ఇప్పించాలని, కొంత కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు జి.శ్రీనివాసరావు, ఎస్.కె.రెహమాన్, విజయ్, పాశం పూర్ణచంద్రరావు తదితరులున్నారు.

అర్జీ అందచేస్తున్న నాయకులు